క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలకు రూ.50 వేల విరాళం



సిరికొండ: న్యావనంది గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామంలోని తూముకాడి మున్నూరు కాపు సంఘం సభ్యులు రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఆదివారం సమావేశమైన సంఘం సభ్యులు పాఠశాల అభివృద్ధికి విరాళం ఇవ్వాలని నిర్ణయించారు. పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనులకు తమ సంఘం తరపున సహకారం అందించాలని గ్రామాభివృద్ధి కమిటీకి విరాళం అందిస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.

అనాథల ఆత్మశాంతి కోసం కాశీలో కర్మకాండలు



నిజామాబాద్‌నాగారం: కొంతకాలంగా ఇందూర్ యువత సంస్థ ఆధ్వర్యంలో అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేకంగా అనాథల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కాశీలో మణికర్ణిక ఘాట్ వద్ద కర్మకాండలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, సాయితేజ, భాస్కర్, సంజీవ్, నీవాస్, భాస్కరచారీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామి ఉత్సవాలు ప్రారంభం



భీమ్‌గల్: శ్రీలక్ష్మీ నృసింహ స్వామి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామ దేవత, పెదగంటి ఎల్లమ్మ తల్లికి, లక్ష్మీనృసింహ స్వామికి శేష వస్త్రాలు, సారె సమర్పించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, మంగళ హారతులు, గోవింద నామస్మరణతో భక్తులు వెంట రాగ పెదగంటి ఎల్లమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె, శేష వస్త్రాలు సమర్పించారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం

- ఎన్నికల్లో అంతుచిక్కని బాల్కొండ ఓటరు నాడి
- ఓట్ల కోసం ప్రధాన పార్టీల నేతల ఆరాటం

మోర్తాడ్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో సోమవారం బాల్కొండ అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్లు ఇచ్చే తీర్పు ఎలా ఉండబోతుందో సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒక్కో ఎన్నికలో ఒక రకమైన తీర్పును ఇస్తున్న బాల్కొండ ఓటరు నాడి ఏ పార్టీ నాయకులకు చిక్కకుండా ఉంది. 2023లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రం అంతటా కాంగ్రెస్ గాలి వీస్తే బాల్కొండ నియోజకవర్గంలో మాత్రం భిన్నమైన తీర్పును ఇచ్చిన ఓటర్లు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రశాంత్‌రెడ్డిని గెలిపించారు. ఈ ఎన్నికల్లో వచ్చిన తీర్పును బాల్కొండ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో తిరగ రాస్తారా లేదా అసెంబ్లీ ఎన్నికల తీర్పును పునరావృతం చేస్తారా అనే అంశంపై స్పష్టత కరువైంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి సిట్టింగ్ ఎంపీ కవితపై గెలిచిన అర్వింద్‌కు 67,170 ఓట్లు దక్కాయి. ఈసారి కూడా అర్వింద్‌కు అంతకుమించి ఓట్లు వచ్చేలా అన్నపూర్ణమ్మ ఆమె మద్దతుదారులు ప్రయత్నిస్తున్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు తగ్గకూడదని ప్రశాంత్‌రెడ్డి, బలం పెంచుకోవాలని సునీల్‌రెడ్డి, పాత రికార్డును కాపాడుకోవాలని అన్నపూర్ణమ్మలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఓటర్లు ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.



సిరికొండకు సామగ్రితో చేరుకున్న సిబ్బంది



ఇందల్వాయిలో విధుల్లో నిమగ్నమైన సిబ్బంది



ధర్పల్లిలో..

పోలింగ్‌కు సర్వం సిద్ధం

సాక్షి నెట్‌వర్క్ : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని ఆదివారం సాయంత్రమే పోలింగ్ కేంద్రాల వద్దకు చేర్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలను స్థానిక అధికారులు సమకూర్చారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపడానికి పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిరికొండ పరిధిలో 43, ధర్పల్లిలో 35, ఇందల్వాయిలో 35, నిజామాబాద్ రూరల్ పరిధిలో 47 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ఆయా మండలాల అధికారులు తెలిపారు. ఓటు వేసేవారు ఓటరు స్లిప్పుతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని వారు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.



శ్రీనగర్‌లో పోలింగ్ బూత్‌లో వసతులను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది



డిచ్‌పల్లి సీఎంసీ వద్ద తమకు కేటాయించిన ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



సామగ్రిని తీసుకెళ్తూ..

ఎన్నికల సామగ్రి పంపిణీ

- ఏర్పాట్లపై సిబ్బంది అసంతృప్తి
- పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో

డిచ్‌పల్లి: పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్‌లకు సంబంధించి డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. అర్బన్, రూరల్ సెగ్మెంట్లకు వేర్వేరుగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు, వైద్య శిబిరం, సిబ్బందిని తరలించేందుకు వాహనాలు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ముందుగా సెంటర్‌కు చేరుకున్న సిబ్బందికి అధికారులు విధులు కేటాయించారు. పీవో, ఏపీవో, ఓపీవోలతో కూడిన బృందాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఎన్నికల సామగ్రి అందజేశారు. చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందా లేదా అని సిబ్బంది జాగ్రత్తగా అక్కడే సరిచూసుకున్నారు. ఈవీఎంలు పని చేస్తున్నాయా లేదా అని పరిశీలించి చూశారు. ఈవీఎంలలో ఏదైనా సమస్య తలెత్తితే సరి చేయడానికి ఈసీఐఎల్ టెక్నీషియన్‌లను అందుబాటులో ఉంచారు. మధ్యాహ్నం భోజనాలు చేసిన అనంతరం పోలింగ్ సిబ్బందిని వాహనాల్లో వారికి కేటాయించిన గ్రామాలకు, పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అర్బన్‌లో మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్, రూరల్‌లో ఆర్డీవో రాజేంద్రకుమార్‌లు ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు. రూరల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లపై పోలింగ్ సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. కూలర్లు పని చేయకపోవడంతో ఎండ వేడిమి, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. తాగు నీరు సైతం వేడిగా ఉన్నాయని పలువురు అసహనం వ్యక్తం చేశారు.


స్ట్రాంగ్ రూముకు చేరిన పోస్టల్ బ్యాలెట్లు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపు కేంద్రమైన డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూముకు ఆదివారం తరలించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్వీయ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వచ్చిన పోస్టల్ బ్యాలెట్లను ముందుగా కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూములో భద్రపర్చగా, వాటిని పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రత్యేక కంటైనర్ వాహనంలో ఆదివారం సీఎంసీ కళాశాల కౌంటింగ్ సెంటర్ స్ట్రాంగ్ రూముకు చేర్చారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్‌తో పాటు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్లను జాగ్రత్తగా భద్రపర్చి, స్ట్రాంగ్ రూంకు సీల్ వేశారు.



ఓటు వేసేదెలా?

- జీపీ కార్యదర్శులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఇవ్వని ఈసీ
- ఉదయం నుంచే పోలింగ్ విధుల్లో పాల్గొననున్న కార్యదర్శులు



బోధన్ : పార్లమెంట్ ఎన్నికల్లో పంచాయతీ కార్యదర్శులు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయింది. వారికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఇవ్వలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు పోలింగ్ విధుల్లో ఉండే కార్యదర్శులు తమ గ్రామాల్లో ఓటు వేసే అవకాశం లేదు. ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 530 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఇతర జిల్లాల వారు సైతం ఉన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వారు మరో నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్నారు. కార్యదర్శులకు ఎన్నికల సంఘం ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ఇవ్వలేదు. దాంతో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించేకునే అవకాశం లేకుండా పోయింది. కార్యదర్శులను బీఎల్‌వో క్యాడర్‌గా గుర్తించి పోలింగ్ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన విధులను జిల్లా యంత్రాంగం అప్పగించింది. మరో ప్రత్యామ్నాయ మార్గంగా ఆయా మండల స్థాయి అధికారులు ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికేట్) జారీ చేసి ఉంటే, విధులు నిర్వర్తించే గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు అవకాశం ఉండేది. ఈ సర్టిఫికేట్ కూడా అధికారులు జారీ చేయలేదు. ఈ పరిస్థితిల్లో పోలింగ్ కేంద్రాల సౌకర్యాలు, సిబ్బంది భోజన వసతులు ఏర్పాట్లు విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు ఓటు వినియోగించుకునే అవకాశం కోల్పోనున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం పంచాయతీ కార్యదర్శులకు ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్స్ ఇచ్చి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించింది. కానీ ప్రస్తుతం ఆ అవకాశం ఇవ్వలేదు. ఈ విషయంలో డీపీవో తరుణ్ జోషిని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల సంఘం ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్స్ ఇవ్వనందునా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం లేదన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి: ధర్మారం(బి)లో శ్రీదేవీ భూదేవీ సహిత వెంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయం సత్యనారాయణ స్వామి, విజయ గణపతి- నవగ్రహములు, ఉమామహేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, సంతాన నాగేంద్ర స్వామి దేవాలయాల ద్వాదశ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మశ్రీ వేలేటి పశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రావుల బ్రహ్మానందం, ప్రధానార్చకులు రాహుల్ త్రిపాఠి తెలిపారు.

బీజేపీలో చేరికలు



సిరికొండ: పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తలకట్ల పెద్ద గంగారెడ్డి, సాగర్‌రెడ్డిలు జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి సమక్షంలో బీజేపీలో ఆదివారం చేరారు. జిల్లా అధ్యక్షుడు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ఐటీ సెల్ కన్వీనర్ గోవింద్, గంగారెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్టేషన్‌లో ఎన్నికల అధికారులకు ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఎస్ఎఫ్ఐ మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల అధికారులకు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం ఎన్నికల అధికారులు ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎఫ్ఐను మోడల్ పోలింగ్‌స్టేషన్‌గా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే.

రూరల్ పరిధిలో ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలు 293
- మొత్తం ఓటర్లు : 2,56,593



ధర్మారం(బి) పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలను సిద్ధం చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ పరిధిలో సోమవారం జరుగనున్న పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 293 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈవీఎంలకు అదనంగా 25 శాతం ఈవీఎంలను అందుబాటులో ఉంచుతున్నారు. ఎక్కడైనా ఈవీఎం మొరాయించిన సందర్భంలో దానిని మార్చి వెంటనే కొత్తది ఏర్పాటు చేస్తారు. 293 వీవీ ప్యాట్‌లను అందుబాటులో ఉంచారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో నలుగురు చొప్పున సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 1200కు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారు. సుమారు 1,225 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. అధికారి స్థాయిని బట్టి సెక్టోరల్ ఆఫీసర్లు, పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్ సిబ్బంది ఉన్నారు. వీరితో పాటు ఆన్‌లైన్ వెబ్‌కాస్టింగ్ సిబ్బంది, ఆఫ్‌లైన్ వెబ్‌కాస్టింగ్ సిబ్బంది, వీడియోగ్రాఫర్లు ఉంటారు. 2,56,593 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఏర్పాట్లు చేశారు. పురుషులు 1,19,769, మహిళలు 1,36,818, ఇతరులు ఆరుగురు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు 144 సెక్షన్ విధించారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు ఓటర్లు మినహా ఇతరులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. 15 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు గుర్తించారు. ఆ పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో షూటింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- మెడికల్, బ్లడ్ డొనేషన్ క్యాంపుల ఏర్పాటు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జన్మదిన వేడుకలను ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. నగరంలోని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ప్రారంభించారు. అనంతరం మార్వాడీగల్లిలోని డీఎస్ఎన్ కార్యాలయంలో ఇందూరు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది బీజేపీ నాయకులు, సూర్యనారాయణ అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శిబిరాలను విజయవంతం చేసిన వైద్యులు, మెడికల్ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇందూరు ప్రజల ఆధారాభిమానాలు ఎల్లప్పుడూ తనపై ఉండాలని ఆకాంక్షించారు. తన పుట్టిన రోజు సందర్భంగా అర్బన్ నియోజకవర్గంలో ప్రజలందరూ ఓటుహక్కు వినియోగించుకుని 100 శాతం పోలింగ్ జరిగేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, అదే తనకిచ్చే బహుమతిగా భావిస్తానని తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, నాయకులు నారాయణ, రాఘవేందర్, మల్లేష్ యాదవ్, నాగరాజు, వీరేందర్, రాకేష్, కార్తీక్, మురళీ, సతీష చ కర్ణ వర్ధన్, శీను, నరేష్ గౌడ్, దీపక్, సురేష్, ఆనంద్, కులాచారి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ వైస్ ఎంపీపీ



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో జితేందర్ నాయక్ ఆయన భార్య జమున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే, కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు మద్దుల రమేష్, గడ్డం గంగారెడ్డి, నర్సారెడ్డి, సొప్పరి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత రద్దు

నందిపేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే వారాంతపు సంత రద్దయినట్లు తహసీల్దార్ ఆనంద్ కుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నందిపేటలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున సంతను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,800	వెండి (కిలో)	86,000
22 క్యారెట్స్	67,200	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	70	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	25	50	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	40	60
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	75
క్యాప్సికం	50	80	- సుభాష్‌నగర్		

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ప్రతినిధి-2 (తెలుగు)-10.45, 4.30, 10.30; కృష్ణమ్మ(తెలుగు)- 1.35, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు)-7.30
స్క్రీన్-2	ఆ ఒక్కటీ అడక్కు(తెలుగు)- 1.40; బాక్(తెలుగు)- 4.30; కృష్ణమ్మ(తెలుగు)-7.30, 10.30
స్క్రీన్-3	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (ఇంగ్లీష్)-10.50, కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు)- 1.45,4.40,7.30,10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	బాక్ (తెలుగు) - 4.35, కృష్ణమ్మ (తెలుగు) - 1.40, 7.45, 10.40
స్క్రీన్-2	కృష్ణమ్మ (తెలుగు) - 11.00, 1.50, 7.20, 10.10, ప్రతినిధి-2 (తెలుగు)-4.40
స్క్రీన్-3	శ్రీకాంత్ (హిందీ)- 10.25, 1.25, 7.20, 10.20 ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు)-4.25
స్క్రీన్-4	ప్రతినిధి-2(తెలుగు)-10.40, 7.35, 10.30. ఆ ఒక్కటీ అడక్కు(తెలుగు)-1.35, ప్రసన్నవదనం(తెలుగు)-4.30
దేవి	టిల్లు స్క్వేర్(తెలుగు)-11.15,2.15 ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు)-6.15,9.15
నటరాజ్	కింగ్ డమ్ ఆఫ్‌ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్(తెలుగు)
లలితామహల్	ప్రతినిధి-2(తెలుగు)
విజయ్	కృష్ణమ్మ (తెలుగు)